సాక్షి అనకాపల్లి

సోమవారం । 22 । మే । 2023



పోటెత్తారు

అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయం క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. 8లో



ఊళ్లను తలపిస్తున్న లేఅవుట్లు

జగనన్న లేఅవుట్లు ఊళ్లను తలపిస్తుంటే చంద్రబాబు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఉమాశంకర్ ధ్వజమెత్తారు. 8లో

గిరినాగు హల్‌చల్



దేవరాపల్లి మండలంలోని నాగయ్యపేట శివారు కడకొండ రోడ్డులో ఆదివారం సాయంత్రం గిరినాగు హల్‌చల్ చేసింది. ఓ యువకుడు దానిని పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచి పెట్టాడు. 8లో

న్యూస్‌రీల్

3న మహాలక్ష్మీ వైకుంఠ నారాయణుల విగ్రహాల ప్రతిష్ట



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీనగ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఉప ఆలయంలో శ్రీమహాలక్ష్మీవైకుంఠ నారాయణుల విగ్రహాలను వచ్చేనెల 3న ప్రతిష్ఠించనున్నారు. ఆ కార్యక్రమాల కరపత్రాలను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం ఆవిష్కరించారు. మిందిలోని మంత్రి స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 8గంటలకు మహాలక్ష్మీవైకుంఠ నారాయణుల పాలరాతి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జియర్‌స్వామి పాల్గొనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల బాబురావు, కమిటీ సభ్యులు గొల్లవిల్లి రామకృష్ణప్రసాద్, గొల్లవిల్లి కోటేశ్వరరావు, నర్సింగరావు, బండారు ఆదిబాబు, ఆంజనేయులు, సాంబశివ, చిరంజీవి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు

అనకాపల్లిటౌన్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా, కోడిపందాల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నట్టు పేర్కొన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు దాడులు చేసి వెయ్యి లీటర్ల బెల్లం పులుపు, ఎనిమిది లీటర్ల సారా, నాలుగు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఏడు కేసులు నమోదు చేసి, నలుగురిని అరెస్టు చేసినట్టు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 44మంది పైకేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 19మంది, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న 66మందిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. మోటర్ వెహికల్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 732 కేసులు నమోదు చేసి, రూ.1,49,345 అరాధ రుసుం విధించినట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆకర్షణీయంగా అప్పన్న ఆలయ నమూనా



ఆలయ నమూనాతో విద్యార్థిని చంద్రమానస

ఎస్.రాయవరం: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన సింహాచలం దేవస్థానం నమూనాను దార్లపూడి గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని తయారు చేశారు. విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ తృతీయ సంవత్సరం చదువుచున్న పోలిశెట్టి చంద్రమానస ఇంటి వద్ద 32 రోజుల పాటు శ్రమించి ఆకర్షణీయమైన నమూనా తయారు చేశారు. తల్లిదండ్రులు పోలిశెట్టి సుబ్బారావు,శ్యామల అవసరమైన సహకారం అందించారు. 6 అడుగుల పొడవు,3 అడుగుల వెడల్పుతో చేసిన నమూనాను దేవస్థానం అధికారులకు అందజేసినట్టు చంద్రమానస తెలిపారు. సుమారు రూ.50 వేలు ఖర్చు చేసి ఈ నమూనాను తయారు చేసినట్టు ఆమె చెప్పారు. ఈనమూనా దేవస్థానానికి వచ్చే భక్తులు తిలకించే విధంగా అధికారులు ఏర్పాటు చేయనున్నారు.

ప్రశాంతంగా ఎంఎస్ఎంఈ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో నిర్వహిస్తున్న అడ్వాన్స్ డిప్లమో ఇన్ డై-మౌల్డ్ మేకింగ్, అడ్వాన్స్‌డ్ డిప్లమో ఇన్ మెకట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంఎస్ఎంఈ సెట్-2023 ఆదివారం నిర్వహించారు. రెండు కోర్సుల్లో ప్రవేశాలకు విశాఖ, అనకాపల్లి, విజయవాడల్లో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 328 మంది దరఖాస్తు చేయగా 297 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పరిశీలించారు.

చెరువు నిండుగా.. చేను పండగ..

- 'సమీకృత వ్యవసాయ పరివర్తన' ద్వారా తీరనున్న సాగునీటి ఇబ్బందులు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 చెరువుల నిర్మాణం, ఆధునీకరణ
- ప్రపంచ బ్యాంకు సహకారంతో 55, ఏపీఐఎల్ఐపీ సహకారంతో 43 చెరువుల అభివృద్ధి
- వీటి ద్వారా 12,828 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి పరిరక్షించుకోవాలి. వ్యవసాయానికి అనుకూలంగా, ఆత్మబంధువుగా మార్చుకోవాలి. శివారు పంట పొలాలు సైతం నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఉండకూడదన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనికోసం 'ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం' అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. వీటిలో అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా 73 చెరువులున్నాయి.



నిర్మాణంలో చప్టా

సాక్షి, అనకాపల్లి: చిన్న, సన్నకారు రైతులకు సాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా సకాలంలో రైతులు పంటలు పండించుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. నీటి సదుపాయం లేక పండించే పంటలకు ఆశించినంత మేర దిగుబడులను ఆర్జించలేకపోతున్నారు. పంటలు పండించేందుకు ముందస్తుగా తగిన నీటి సదుపాయం ఉంటే రైతు వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందడానికి ఆస్కారం ఉంటుంది. రైతుకు లాభసాటిగా ఉండేవిధంగా చెరువుల అభివృద్ధి, నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. సాగునీటి ఇబ్బందులు తొలగించడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 'ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం' తీసుకొచ్చింది. 70 శాతం ప్రపంచబ్యాంకు నిధులు, 20 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో సంయుక్తంగా చెరువుల నిర్మాణాలు చేపడుతోంది. ఇందులో స్వతంత్ర, గొలుసు కట్టు చెరువులు, వంద ఎకరాలపైగా ఆయకట్టు ఉన్న పెద్ద చెరువులు, చిన్న చెరువుల నిర్మాణ పనులు చేపడుతోంది. దీనిలో భాగంగానే ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ప్రపంచ బ్యాంక్ సహకారంతో 55, ఏపీఐఎల్ఐపీ సహకారంతో 43 చెరువులు అభివృద్ధి చేస్తున్నారు. ఈ చెరువుల ద్వారా 12,828 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

చెరువుకు రూ.30 లక్షల నుంచి రూ.70 లక్షలు..

2025 ఏడాది నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం శరవేగంగా పనులు చేపడుతోంది. దాదాపు రూ.28 కోట్లతో ఉమ్మడి విశాఖ జిల్లాలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటిలో 49 చెరువుల అభివృద్ధి పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఒక్కో చెరువు నిర్మాణానికి అవసరం మేరకు రూ. 30 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు కేటాయించారు. 18 చెరువులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. మిగిలిన 31 చెరువుల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి.

ఐదు శాఖల సహకారం

వాతావరణంలోని మార్పులను తట్టుకుని వ్యవసాయ ఉత్పాదకతను, ఆదాయాన్ని పెంచే విధంగా రైతులు పంటలను పండించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని విస్తృతం చేశారు. వ్యవసాయ, భూగర్భజల, నీటిపారుదల, ఉద్యావన, మత్స్యశాఖ కలిసి సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకంలో చెరువుల నిర్మాణాలు చేపడుతున్నాయి.

రెండు లక్షల మంది రైతులకు లబ్ధి..

ఈ పథకంలో రైతులు సకాలంలో పంటలు వేసుకోవడం, ఏడాదికి మూడు పంటలు పండించుకునేందుకు వీలు కలుగుతుంది. వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచుకోవడం, వాతావరణ సానుకూల పద్ధతులను ప్రోత్సహించడం జరుగుతుంది. ఈ పథకం ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాలో రెండు లక్షల మంది సన్న, చిన్నకారు రైతులకు లబ్ధి చేకూరనుంది. 25 శాతం వరకు పంటఉత్పాదకతను, చెరువుల్లో చేపల ఉత్పాదకత 47 శాతం వరకు మెరుగుపరచుకోవచ్చనేది వ్యవసాయ, భూగర్భ జల వనరులశాఖ అధికారులు చెబుతున్నారు.చెరువులనుఅభివృద్ధిచేయడం ద్వారా భూగర్భ జలాల పెరుగుదల సాధ్యమవుతుంది.

విశాఖ జిల్లా...

ఏపీఐఐఏటీపీ కింద 7 పనులు (9 చెరువులు) పునరుద్ధరణకు రూ.10.38 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 5 పనులకు (7 చెరువులు)కు గానూ రూ.6 కోట్ల 8 లక్షల 47 వేలతో ప్రతిపాదనలు ఖరారయ్యాయి. పనులు పురోగతిలో ఉన్నాయి. వీటి కారణంగా 986 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడం జరిగింది.

అల్లూరి జిల్లా...

ఏపీఐఐఏటీపీ కింద 6 పనులకు(16 చెరువులు) పునరుద్ధరణ కోసం రూ.3.37 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 3 పనులకు(3 చెరువులు)కు గానూ రూ.2 కోట్ల 6 లక్షల 36 వేలతో ఒప్పందాలు ఖరారయ్యాయి. పనులు పురోగతిలో ఉన్నాయి. వీటి కారణంగా 1,150 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడం జరిగింది.



చెరువు చుట్టూ వేస్తున్న గట్టు



పనులు చేస్తున్న కూలీలు

అనకాపల్లి జిల్లా ...

ఏపీఐఐఏటీపీ పథకంలో భాగంగా 27 పనులతో 73 చెరువుల పునరుద్ధరణ కోసం రూ.33 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 13 పనుల(33 చెరువులు)కు గానూ రూ.20.84 కోట్లు ఖర్చుచేసింది. వీటి కారణంగా 7,232 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. 14 పనులకు గానూ ..ఐదు పనులకు (17 చెరువులు) టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. మిగిలిన 9 పనులు(23) పురోగతిలో ఉన్నాయి

చురుగ్గా పనులు



ఏపీ సమీకృత సాగునీరు వ్యవసాయ పరివర్తన పథకం 2020లోనే ప్రారంభమైంది. అయితే కరోనా కారణంగా పనులు మందకొడిగా సాగాయి. గత రెండేళ్లుగా పనులు వేగంగా సాగుతున్నాయి. గ్రామాల్లో వ్యవసాయానికి తోడ్పాటు అందించేవి చెరువులే. వర్షాలు పడేటప్పుడు నీరు నిల్వ ఉండేందుకు గ్రామాల్లో చెరువులు ఉపయోగపడతాయి. ఈ చెరువుల అభివృద్ధి, నిర్మాణ పనులతో పంటల ఉత్పత్తులు పెంచుకోవడంతో పాటు రైతుకు ఆదాయం పెరుగుతుంది. వ్యవసాయానికి నీరు అందించే బోరుబావుల్లో వేసవి సమయాల్లో నీరు అడుగంటకుండా సహాయపడుతుంది. భూగర్భ జలాలను నిల్వ చేయడానికి, వాటితోపాటు చేపల పెంపకంతో ఆదాయ వనరులు పెరుగుతాయి.

– కె.రమేష్‌బాబు, పీడీ, ఏపీఐఐఏటీపీ

ఏసీలో హాయ్ హాయ్!

- ఏసీ బస్సుల్లో ప్రయాణానికి మొగ్గు
- 80 శాతానికి పైగా చేరిన ఆక్యుపెన్సీ
- నాన్ ఏసీ సర్వీసులకు మించిన ఓఆర్
- ఆర్టీసీకి ఊరటనిస్తున్న వేసవి తాపం



సాక్షి, విశాఖపట్నం: వేసవి తాపం తాట తీస్తోంది. ఎండ మంట పుట్టిస్తోంది. వడగాడ్పులు బేజారెత్తిస్తున్నాయి. ఇళ్లలో ఉంటేనే సెగలు కక్కుతున్నాయి. ఇక ప్రయాణాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఒకపక్క స్కూళ్లు, కాలేజీలకు సెలవులొచ్చాయి. మరోపక్క పెళ్లిళ్లు కూడా ఊపందుకున్నాయి. దీంతో ఊళ్లకు, విహార యాత్రలకు వెళ్లే వారి సంఖ్య అధికమైంది. ఇలా ఊళ్లు వెళ్లే వారు ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందడానికి ఏసీ బస్సుల్లో ప్రయాణాలకు మొగ్గు చూపుతు న్నారు. మధ్య తరగతి, ఆపై స్థాయి ప్రయాణికులు నాన్-ఏసీ ప్రయాణంకంటే ఏసీ బస్సుల్లో ఎక్కువ చార్జీ అవుతున్నప్పటికీ వెనకడుగు వేయడం లేదు. ఫలితంగా ఆర్టీసీతో పాటు ప్రైవేటు ఏసీ బస్సుల్లోను సీట్లు, బెర్తులకు డిమాండ్ పెరుగుతోంది. గత నెలలో ఏపీఎస్ఆర్టీసీ ఏసీ సర్వీసుల్లో 50 శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ఉండగా ఇప్పుడది 80 శాతానికి పైగా చేరుకుంది. అదే సమయంలో నాన్-ఏసీ సర్వీసులకు కూడా ఓఆర్ పెరిగినా ఏసీ సర్వీసులతో పోల్చుకుంటే తక్కువగానే ఉంటోంది. గత నెలలో నాన్-ఏసీ బస్సుల్లో ఓఆర్ 60 శాతం ఉండగా ప్రస్తుతం 75 శాతం వరకు పెరిగింది.

అమలాపురం సర్వీసుకు 87 శాతం ఆక్యుపెన్సీ

విశాఖ జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ రోజుకు 30 ఏసీ బస్సులను నడుపుతోంది. వీటిలో హైదరాబాద్‌కు ఆరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళంలకు 16, విజయవాడ, కడప, అమలాపురంలకు ఎనిమిది చొప్పున వెళ్తున్నాయి. ఇవన్నీ 80 శాతం పైనే ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. వీటిలో అత్యధికంగా విశాఖపట్నం నుంచి అమలాపురం ఇంద్ర ఏసీ సర్వీసుకు 87 శాతం, ఆ తర్వాత స్థానంలో విశాఖ నుంచి కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళంలకు నడిచే మెట్రో లగ్జరీకి 85 శాతం ఆక్యుపెన్సీ రేషియో ఉంటోంది. అలాగే 84 శాతం ఓఆర్‌తో విజయవాడ అమరావతి సర్వీసుకు, 82 శాతం ఓఆర్ కడప ఇంద్ర ఏసీ సర్వీసుకు ఉంది. సగటున 80 శాతానికి మించి ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ లభిస్తుండడం ఆర్టీసీకి ఊరటనిస్తోంది. ఈ వేసవిలో ఏసీ బస్సుల్లో ప్రయాణాలు ఆశాజనకంగా పెరిగాయని, ఇది ఆర్టీసీకి లాభదాకమని విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. గత నెలతో పోల్చుకుంటే వీటిలో ఓఆర్ పెరుగుదల బాగుందని తెలిపారు.

ప్రైవేటు ఆపరేటర్లకు కాసుల పంట

వేసవి తాపం ప్రైవేటు బస్సు ఆపరేటర్లకు కాసులు కురిపిస్తోంది. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న కొద్దీ ఏసీ టికెట్లకు డిమాండ్ అధికమవుతోంది. దీనిని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు 'క్యాష్' చేసుకుంటున్నాయి. ఏసీ స్లీపర్ విశాఖపట్నం నుంచి విజయవాడకు రూ.1700-2200 వరకు, హైదరాబాద్‌కు రూ.2500 నుంచి 3200 వరకు వసూలు చేస్తున్నారు. అదే సీటయితే విజయవాడకు రూ.1300-1500, హైదరాబాద్‌కు డిమాండ్‌ను బట్టి రూ.2000-2500 వరకు తీసుకుంటున్నారు.

చిట్టి చేతులు చక్కని చిత్రాలు

ఉత్సాహంగా సాక్షి చిత్రలేఖన పోటీలు



చిత్ర లేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



బహుమతి అందజేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, మేయర్ హరివెంకట కుమారి

సీతంపేట: చిట్టి మెదళ్లలో ఆలోచనలకు రంగులద్ది అద్భుత చిత్రాలను ఆవిష్కరించారు. 'నీటిని ఎలా ఆదా చేయాలి' అంశంపై చిన్నారులు గీసిన చిత్రాలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశాయి. విశాఖ నగర అందాలను పిల్లలు తమ కాన్వాసులపై అద్భుతంగా తీర్చిదిద్దారు. సాక్షి ఆధ్వర్యంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన బాలలకు చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన లభించింది. నగరంలో పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగంలో రెండు కేటగిరిల్లో పోటీలు జరిగాయి. 10 ఏళ్లలోపు జూనియర్స్‌కు 'సేవ్ వాటర్ థీమ్', 10 నుంచి 16 ఏళ్లలోపు సీనియర్ విభాగం విద్యార్థులకు 'బ్యూటీ ఆఫ్ వైజాగ్' థీమ్‌పై చిత్రలేఖన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ చక్కటి థీమ్‌తో చిత్రలేఖన పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా మంచి కార్యక్రమం చేపట్టిన సాక్షిని అభినందించారు. భవిష్యత్తులో ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు మాట్లాడుతూ చదువుతోపాటు పిల్లలకు నచ్చిన ఏదో ఒక అంశంలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని తల్లిదండ్రులను కోరారు.

సీనియర్, జూనియర్స్ విభాగాల్లో వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు, 10 మందికి కన్సొలేషన్ బహుమతులు, మరో 10 మందికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సీనియర్ డ్రాయింగ్ టీచర్లు కనుమూరి శ్రీనివాసరావు, భాగవతుల శంకరరావు, పిడమర్తి సుధాకర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇంచార్జి కేజీ రాఘవేంద్రారెడ్డి, సాక్షి టీవీ బ్యూరో ఇంచార్జి రామచంద్రరావు, బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు, యాడ్స్ డీజీఎం శ్రీనివాసరావు, సాక్షి సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలు వీరే..

జూనియర్ విభాగంలో...

మొదటి బహుమతి ఎం.ప్రేమ్ సాత్విక్ (థర్డ్ క్లాస్, కొటక్ స్కూల్), ద్వితీయ బహుమతి బి.హనీష్ కృష్ణారెడ్డి (ఐదో తరగతి, సెయింట్ ఆన్స్ స్కూల్), తృతీయ బహుమతి ఎం.అన్విత (4వ తరగతి, లిటిల్ ఏంజిల్స్ స్కూల్)

కన్సొలేషన్ బహుమతులు

వి.హన్సిక (శ్రీ ప్రకాష్ స్కూల్), షహింజ్ తబస్సుం (శ్రీ చైతన్య), కె.శ్రీ సమన్విత (సత్య సాయి), జె.లక్ష్మీచైత్ర (శ్రీ అంజన స్కూల్), ధరజ్ వెరోనిక (ఆల్వార్ దాస్), ఒమ్మి జోహిత (విశాఖ వేలీ), ఎస్.కోశల్ (బాలాజీ స్కూల్), వి.బి.ఎస్.లక్షిత (టింపనీ) పి.హర్షిత (లిటిల్ ఏంజిల్స్), డి.హరిశ్రిత.

సీనియర్ విభాగంలో..

మొదటి బహుమతి ఎం.హారిక (శ్రీచైతన్య స్కూల్), ద్వితీయ బహుమతి పూర్వి రజాక్ (లిటిల్ ఏంజిల్స్) తృతీయ బహుమతి సిహెచ్. భావజ్ఞ (శ్రీప్రకాష్).

కన్సొలేషన్ బహుమతులు

వి.ధనుజ సుకన్య (ఆర్‌బీఎం యూపీ స్కూల్), ఎస్.చారుశ్రీ (శ్రీప్రకాష్) దీక్ష వాక, అక్షర్ మేధ (లిటిల్ ఏంజిల్స్), బి.షణ్ముక శ్రీ (వీటీ హైస్కూల్), ఎ.లోకేశ్వరి (వీటీ హైస్కూల్), కె.మానస (కేంద్రీయ విద్యాలయం), కె.ఎల్. అనూష (కేంద్రీయ విద్యాలయం), ఎం.రోషన్ కార్తికేయ (డీపీఎ), బి.గాయత్రి.

కోర్టుల భవనాలకు త్వరలో మోక్షం

- చర్యలు తీసుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, బార్ అసోసియేషన్
- ఇప్పటికే మంజూరైన నిధులతోనే పనుల పూర్తికి చర్యలు
- ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ దృష్టికి సమస్యలు
- సానుకూలంగా స్పందించిన ఉన్నతాధికారులు



అసంపూర్తిగా నిలిచిపోయిన చోడవరం కోర్టుల సముదాయం



జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపికి నిలిచిన నిర్మాణాల గురించి వివరిస్తున్న దృశ్యం(ఫైల్)

చోడవరం రూరల్: నూతనంగా ఏర్పాటైన అనకాపల్లి జిల్లాలో నాలుగు ప్రధాన పట్టణాల్లోని కోర్టుల సముదాయాల్లో ఏళ్ల తరబడి వేధిస్తున్న వసతి సమస్యకు పరిష్కారం దొరికేదిశగా అడుగులు పడుతున్నాయి. సుమారు రూ.38 కోట్ల అంచనా వ్యయంతో చోడవరం, నర్సీపట్నంలలో చేపట్టిన కోర్టు భవన సముదాయాల నిర్మాణపనులు కొన్ని కారణాలతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో కక్షిదారులు, న్యాయవాదులు, ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి నర్సీపట్నం, చోడవరం కోర్టుల భవన సముదాయాలను సందర్శించారు. అక్కడి న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ల ప్రతినిధులు భవన నిర్మాణాల్లో ఏర్పడిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఆయన ఉన్నతాధికారులకు సమస్యను తెలిపారు. మరో వైపు బార్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా భవన నిర్మాణాలు పూర్తయ్యే దిశగా కృషి చేశారు. దీంతో నిర్మాణ ప్రక్రియలో కదలిక వచ్చింది.

పనులు పూర్తవక..

2018లో చోడవరం, నర్సీపట్నంలలో నాలుగేసి కోర్టుహాళ్లు, కార్యాలయాలు, కక్షిదారుల నిరీక్షణ హాళ్లు, బార్ అసోసియేషన్ కార్యాలయం, లైబ్రరీలు, చుట్టూ రక్షణగోడ, లిఫ్టులు తదితర అన్ని వసతుల ఏర్పాటుకు ఒక్కో నిర్మాణానికి రూ.19 కోట్లు మంజూరు చేశారు. దీంతో పనులు కూడా ప్రారంభమయ్యాయి. కరోనా, తర్వాతి సమస్యల కారణంగా పనులు మధ్యలోనే ఆగిపోయాయి. నర్సీపట్నంలో గ్రౌండ్ ఫ్లోర్‌కు శ్లాబ్‌ను పూర్తి చేసి ఫస్ట్ ఫ్లోర్ పనులు చేయాల్సిన దశలో నిలిచిపోగా, చోడవరం గ్రౌండ్ ఫ్లోర్ శ్లాబ్ లెవెల్‌కు పిల్లర్ల నిర్మాణం మాత్రమే పూర్తయింది. అనకాపల్లిలో స్థలం ఇంకా ఖరారు కాలేదు. యలమంచిలిలో ప్రతిపాదనలు సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) దశలోనే ఉన్నాయి.

పెరిగిన అంచనా వ్యయం

కరోనా అనంతరం భవనాల నిర్మాణ వ్యయం బాగా పెరిగింది. నర్సీపట్నం, చోడవరంలలో నిర్మాణంపూర్తి చేయాలంటే రూ.25 కోట్ల చొప్పున వ్యయం అవుతుందని ఇంజనీరింగ్ విభాగం అంచనా వేసింది. ఇప్పటికే ఈ రెండు ప్రాంతాల్లో నిర్మాణాలకు రూ.19 కోట్ల చొప్పున మంజూరు కాగా, మిగిలిన రూ.ఆరు కోట్లకు ప్రతిపాదనలను సవరించి, ప్రభుత్వ ఆమోదానికి పంపాల్సి ఉంది. ఈ ప్రక్రియ మరింత జాప్యం అవుతుందన్న కారణంగా విడుదలైన రూ.19 కోట్లతోనే అవసరమైనంత మేర పనులు చేపట్టడానికి సన్నద్ధమయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి, ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి, ఒప్పించడంతో పనుల పునఃప్రారంభానికి చర్యలు చేపట్టారు.

త్వరలోనే పనులు ప్రారంభం

నర్సీపట్నం, చోడవరం కోర్టుల సముదాయాల పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఆశిస్తున్నాం. యలమంచిలిలో నాలుగు కోర్టు హాళ్ల సముదాయాల నిర్మాణాలకు ముసాయిదా పూర్తయ్యింది, సంపూర్ణ అంచనా వ్యయం రూపకల్పనకు టెండర్లు పిలవాల్సి ఉంది. అనకాపల్లి కోర్టులకు సంబంధించి స్థల సమస్య కారణంగా నూతన నిర్మాణాల ప్రతిపాదనలు ముందుకు సాగడం లేదు. స్థల సేకరణ పూర్తయ్యాకే అక్కడ నూతన కోర్టు సముదాయ నిర్మాణానికి రూపకల్పన చేస్తాము.

– సీహెచ్.రమేష్, ఈఈ, ఆర్ అండ్ బీ, విశాఖ

నిధుల మేరకే పనులు



భవన నిర్మాణాల పూర్తికి బార్ అసోసియేషన్ కృషి చేస్తోంది. అమరావతిలో ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీని, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని కలిసి భవన నిర్మాణాల పరిస్థితి వివరించాం. ఉన్న నిధుల మేరకు పనులు చేపట్టాలని కోరాం. అందుకు అనుగుణంగానే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయంలో చొరవ చూపిన స్థానిక న్యాయమూర్తులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తులకు కృతజ్ఞతలు.

–కాండ్రేగుల దేవిడ్, అధ్యక్షుడు, చోడవరం బార్ అసోసియేషన్

అడ్వాన్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

ఉమ్మడి విశాఖ జిల్లాలో హాజరుకానున్న 63,159 మంది విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.ఉమారాణి వెల్లడించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జరగనున్న పరీక్షలకు ఉమ్మడి విశాఖ జిల్లాలో 100 కేంద్రాలు కేటాయించినట్లు వెల్లడించారు. ఫస్టియర్ జనరల్ 41,929 మంది, ఒకేషనల్ 2,633 మంది కలిపి మొత్తం 44,562 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. సెకండియర్ జనరల్ 16,979 మంది, ఒకేషనల్ 1,740 మంది కలిపి 18,719 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరని, విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

15 లీటర్ల సారాతో భార్యాభర్తలు అరెస్టు



సారా విక్రయిస్తూ పట్టుబడిన వారితో ఎస్‌ఐ నాగేంద్ర

దేవరాపల్లి: వాలాబు పంచాయతీలో నాటుసారా విక్రయిస్తూ పట్టుబడిన భార్యాభర్తలను ఆదివారం అరెస్టు చేసినట్టు దేవరాపల్లి ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు. వాలాబుకు చెందిన జుత్తాడ పోతురాజు, సరోజిని నాటుసారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారంతో దాడి చేయగా ఇద్దరూ ఇంటి వద్ద సారా విక్రయిస్తూ పట్టుబడ్డారని, వారి వద్ద నుంచి 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిని అరెస్టు చేసి చోడవరం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి విశాఖ సెంట్రల్ జైల్‌కు రిమాండ్ విధించారన్నారు.

నేడు జీవీఎంసీ స్పందన

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఊళ్లను తలపిస్తున్న జగనన్న లేఅవుట్లు

- చంద్రబాబు ఆరోపణలు అర్థరహితం
- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: విపక్ష నేత చంద్రబాబు తన కళ్లకు కమ్మిన పచ్చ తెరల్ని తొలగించి చూస్తే సెంటు స్థలంలో నిర్మించిన గృహాల శోభ, లబ్ధిదారుల ఆనందం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీ కసిమిరోడ్డులో నిర్మించిన వైఎస్సార్ జగనన్న లేఅవుట్ గృహాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో నిర్మించిన గృహాలు, ఊళ్లను తలపిస్తుంటే చంద్రబాబు ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగనన్న లేఅవుట్‌లో నిర్మించినవి సమాధులో.. ఇళ్లో కళ్లు తెరిచి చూడాలని హితవు పలికారు. సెంటు స్థలంలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇళ్లల్లో చంద్రబాబు, లోకేష్‌లు జీవితకాలం సంతోషంగా నివాసం ఉండవచ్చని ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలోని తొమ్మిది లేఅవుట్లలో 1500 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే 250 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్టు తెలిపారు. పేదలకు ఇంటి స్థలాలిస్తే.. సమాధులు కట్టుకోవడానికి పనికిరావని చెబుతున్న చంద్రబాబు కళ్లు తెరిపించాలనే జగనన్న గృహాలను సందర్శించినట్టు వెల్లడించారు. చంద్రబాబు



జగనన్న లేఅవుట్ సందర్శనలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, అధికారులు, నాయకులు

వ్యాఖ్యలు పేదలను అవమానించడమేనని మండిపడ్డారు. సైకో చంద్రబాబు విశాఖపట్నంకు సముద్రం తెచ్చానని, కంప్యూటర్ కనిపెట్టానని, రూ.2 వేల నోట్లు రద్దు చేయమని తానే చెప్పానని.. ఇలా పిచ్చోడిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు మరోసారి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట తాత్కాలిక చైర్మన్ తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, హౌసింగ్ ఈఈ ఫణి, మాజీ వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, కౌన్సిలర్లు బయపురెడ్డి చినబాబు, బోడపాటి సుబ్బలక్ష్మి, వీరమాచినేని జగదీశ్వరి, మాకిరెడ్డి బుల్లిదొర, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరినాగు హల్‌చల్

దేవరాపల్లి: మండలంలోని నాగయ్యపేట శివారు కడకొండ రోడ్డులో ఆదివారం సాయంత్రం గిరి నాగు హల్‌చల్ చేసింది. కడకొండ రోడ్డు పక్కన పక్షిని నోట కరచి, మింగుతున్న గిరి నాగు అటుగా వస్తున్న జామి పోలినాయుడు, వెంకటరావుల కంట పడింది. సుమారు 15 అడుగుల పొడవున్న పామును చూసి యువకులు భయంతో పరుగులు తీశారు. అదే సమయంలో దేవరాపల్లి ఆదివారపు సంతకు వచ్చి, తన స్వగ్రామమైన కొప్పవానిపాలెం వెళ్తున్న కృష్ణ అనే మరో యువకుడు ధైర్యంగా ముందుకు వచ్చి విష సర్పమైన గిరినాగును చాకచక్యంగా పట్టుకుని, సమీప అటవీ ప్రాంతంలో విడిచి పెట్టాడు. దీంతో సమీపంలోని పంట పొలాల రైతులు, పాడి రైతులు ఊపిరి పిల్చుకున్నారు.

పోటెత్తారు

- భక్తులతో కిటకిటలాడిన గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయం
- పూజలు చేసి.. అమ్మవారికి మొక్కుల చెల్లింపు
- తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసిన స్వచ్ఛంద సంస్థలు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలి రావడంతో ఆలయం క్యూలైన్లు కిటకిటలాడాయి. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువ పందిళ్లలో వంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కుటుంబ సమేతంగా భోజనాలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొంది ఆనందంగా తిరుగుముఖం పట్టారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించి బాలింతలు వారి పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలను మాత్రమే అమ్మవారి ఆలయం వరకూ అనుమతించి, మిగిలిన వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలుపుదల చేశారు.



అమ్మవారి ఆలయ సమీపంలో వంట చేస్తున్న భక్తులు



భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీహరి సేవా సమితి సభ్యులు



అమ్మవారి ఆలయంలోకి వెళ్తున్న భక్తులు

50 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు



పట్టుబడ్డ గంజాయితో ఎస్‌ఐ శిరీష, సిబ్బంది

నక్కపల్లి: విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారులో తరలిస్తున్న 50 కిలోల గంజాయిని నక్కపల్లి ఎస్‌ఐ శిరీష తన సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. వేంపాడ టోల్‌గేట్ వద్ద ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో 50 కిలోల గంజాయిని గుర్తించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన షారుఖాన్, జాబిర్ అనే ఇద్దరు వ్యక్తులు 25 ప్యాకెట్లలో గంజాయి తీసుకెళ్తున్నారు. గంజాయి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మాకవరపాలెం: ఆటోను బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. జి.కోడూరుకు చెందిన కుటుంబం ఆదివారం అనకాపల్లి నుంచి ఆటోపై మాకవరపాలెం వస్తున్నారు. అన్‌రాక్ రిఫైనరీకి వెళ్లే రోడ్డు వద్ద బుచ్చింపేట, కందిపూడికి చెందిన అప్పలనాయుడు(45) బైక్‌పై వస్తూ ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటోలో ఉన్న బి.ఎ స్.పేటకు చెందిన ఆకుల ఆదిత్య(8)కు కాలు, చేయి విరగ్గా, చొడువాడకు చెందిన సేనాపతి రాజులమ్మ(60)కు తీవ్రగాయాలయ్యాయి. అప్పలనాయుడుకు ఎడమకాలు విరిగింది. 108లో నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ రామకృష్ణారావు ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఎస్.రాయవరం: నర్సీపట్నం రోడ్డు, గుల్లిపాడు రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ ఆదివారం తెలిపారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహంపై నలుపు రంగు ప్యాంటు, తెలుపు రంగు చొక్కాపై నలుపు అడ్డగీతలతో కూడిన చొక్కా ఉందని తెలిపారు. తుని వైపు నుంచి విశాఖపట్నం వెళ్లే రైలు నుంచి ఉదయం జారిపడి ఉండవచ్చని చెప్పారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌ని సంప్రదించాలని కోరారు.

లోయలోకి దూసుకుపోయిన కారు

ముంచంగిపుట్టు: మండలంలో గల దారెల పంచాయతీ డి.కుమ్మరిపుట్టు నుంచి ఢీంగుడ గ్రామాల మధ్య శనివారం అర్ధరాత్రి కారు అదుపు తప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో కారులో ఉన్న వారు బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన భార్యభర్తలు రాజేష్, మీనాక్షి డుడుమ జలపాతం చూడడానికి ఇక్కడకు వచ్చి తిరుగు ప్రయాణంలో దారెల గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్తుండగా డి.కుమ్మరిపుట్టు సమీపంలో కారు అదుపు తప్పి రహదారి పక్కనున్న లోయలోకి దూసుకుపోయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. రాత్రి దారెల గ్రామంలో తలదాచుకొని ఆదివారం ఉదయం దారెల సర్పంచ్ పాండు రంగస్వామి, గ్రామస్తుల సహకారంతో కారును లోయలో నుంచి బయటకు తీశారు.



డి.కుమ్మరిపుట్టు వద్ద ప్రమాదానికి గురైన కారు

శారదానదిలో మునిగి యువకుడి మృతి

మునగపాక: సరదాగా స్నానం చేద్దామని నదిలోకి దిగిన యువకుడు మృత్యువాతకు గురైన దుర్ఘటన మండలంలోని గణపర్తిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ మల్కాపురం బాపూజీ కాలనీకి చెందిన దనాల మహేష్(17)తన స్నేహితులతో కలిసి తీన్‌మార్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు కొంకోట మండలం నరసింగబల్లి ఆదివారం వచ్చాడు. ఈ సందర్భంగా స్నేహితులతో కలిసి మహేష్ సమీపంలోని గణపర్తి శారదానదిలో స్నానం చేసేందుకు దిగాడు. దిగుతూనే ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. దీంతో తోటి స్నేహితులు ఆందోళనకు గురై కేకలు వేస్తూ బయటకు వచ్చేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు మహేష్ కోసం గాలింపు చేపట్టారు. కొంతసేపటి తరువాత మహేష్ మృతదేహం లభ్యమైంది. మహేష్ మృతదేహాన్ని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ఏఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహేష్ మృతదేహం

ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన కంటైనర్ లారీ

- ఆటోలోని ప్రయాణికుడి మృతి, ఆటో డ్రైవర్‌కు గాయాలు
- రేగుపాలెం వద్ద ఘటన

యలమంచిలి: ఆగి ఉన్న ఆటోను కంటైనర్ లారీ ఢీకొట్టిన ఘటనలో ఆటోలోని ప్రయాణికుడు మృతి చెందాడు. యలమంచిలి రూరల్ హెడ్‌కానిస్టేబుల్ యర్రబ్బాయి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేట మండలం, ఇందిరా కాలనీకి చెందిన దువ్వాడ కృష్ణ (65) కూలి పని నిమిత్తం ఆటోలో వస్తుండగా ఆదివారం ఉదయం 6 గంటలకు యలమంచిలి మండలం, రేగుపాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఆటో టైరు పంక్చర్ కావడంతో రోడ్డు పక్కకు ఆపి మరమ్మతులు చేస్తున్నారు. ఇంతలో అటుగా తుని నుంచి యలమంచిలి వైపు వస్తున్న కంటైనర్ లారీ వెనుక నుంచి ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో వున్న దువ్వాడ కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో గాయపడిన ఆటో డ్రైవర్ విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని, ఆయా బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ యర్రబ్బాయి తెలిపారు.

పరుగు పందెంలో ఉమాలక్ష్మి ప్రతిభ

నర్సీపట్నం: విశాఖలో నిర్వహించిన మారథాన్ 5కే రన్‌లో నర్సీపట్నంకు చెందిన విద్యార్థిని బి.ఉమాలక్ష్మి సత్తాచాటింది. ఇటీవల జరిగిన అహింసా రన్‌లో ఉమాలక్ష్మి పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. నిర్వాహకుల చేతుల మీదుగా మెడల్‌తోపాటు నగదు ప్రోత్సాహకాన్ని అందుకుంది. నర్సీపట్నంలో ఉంటూ మాకవరపాలెం మండలం, కొండల అగ్రహారం ఇమ్మానుయేల్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఉమాలక్ష్మి, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నట్టు తెలిపింది.



నగదు ప్రోత్సాహక నమూనా చెక్కును అందుకుంటున్న క్రీడాకారిణి ఉమాలక్ష్మి

'న్యూసెన్స్'ను ఆదరిస్తున్నందుకు థ్యాంక్స్

అల్లిపురం : న్యూసెన్స్ వెబ్ సిరీస్ అన్ని వర్గాల వారిని విశేషంగా ఆకట్టుకుందని హీరో నవదీప్ తెలిపారు. నగరంలో గోకుల్ థియేటర్‌లో పాత్రికేయులకు, మరికొందరు ప్రముఖుల కోసం ప్రత్యేకంగా ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన ప్రీమియర్ షోలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై ప్రవీణ్‌కుమార్ దర్శకత్వంలో రూపొందించిన సిరీస్ ఘన విజయం సాధించిందన్నారు. హిట్ టాక్ వచ్చిన తరువాత సక్సెస్ మీట్ చేసుకోవడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. సక్సెస్ తర్వాత విజయోత్సవ టూర్ ప్రేక్షకుల మధ్య చేయడంఆనందంగా ఉందన్నారు. త్వరలో లవ్ మౌళి అనే చిత్రంతోపాటు, మాస్ మహారాజ్ రవితేజతో కూడా నటిస్తున్నట్లు తెలిపారు.



హీరో నవదీప్

మాడుగుల - బోయిపాడు రోడ్డుకు మోక్షం

రూ.కోటీ 90 లక్షలతో పనులు ప్రారంభం

మాడుగుల: సుమారు 20 ఏళ్ల నుంచి గోతులతో దారుణంగా తయారై, రెండు మండలాల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిన రోడ్డు పునరుద్ధరణకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ. కోటీ 90 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు మాడుగుల, చీడికాడ ఎంపీపీలు వేమవరపు రామధర్మజ, కురుసా జయమ్మలు ఆదివారం రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాడుగుల, చీడికాడ మండలాలను అనుసంధానం చేసే ఈ రోడ్డును విస్తరించి, నిర్మాణం చేపట్టనుండటంతో రెండు మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పాలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలిమేర చిన్నారావు, సయ్యపురెడ్డి సత్తిబాబు, కుక్కర శ్రీధర్, జమ్మంగి జగన్ తదితరులు పాల్గొన్నారు.

పులిమెట్టపై శ్రీనివాసుడు

- వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ
- మార్మోగిన స్వామి నామస్మరణ
- నేడు మహాసంప్రోక్షణ, కల్యాణోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన టీటీడీ

రంపచోడవరం: కలియుగ దైవం.. భక్తుల కొంగు బంగారం శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ రంపచోడవరం సమీపంలోని ఐ.పోలవరం జంక్షన్ వద్ద పులిమెట్ట పర్వత శిఖరంపై రుత్వికుల వేద మంత్రాల మధ్య ఆదివారం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేంకటేశ్వర స్వామి, పద్మావతి, గోదాదేవి, గరుడాళ్వార్, ద్వారపాలకుల విగ్రహాలను పవిత్ర జలాలతో అభిషేకించారు. అంతకుముందు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, రత్నన్యాసం, ధాతున్యాసం, ఆలయానికి, రాజగోపురానికి విమాన కలశస్థాపన, విగ్రహస్థాపన నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు మహా శాంతి హోమం, పూర్ణాహుతి, చతుర్దశ కలశస్నపనం, నవకలశస్నపనం, మహాశాంతి తిరుమంజనం జరిపించారు. రాత్రి 8 గంటలకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, రక్షాబంధనం, శయనాధివాసం, విశేష హోమాలు చేపట్టారు. టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతారెడ్డి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జేఈవో వీరబ్రహ్మం, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలదీక్షితులు, ఎస్ఈ సత్యనారాయణ, వీజీవో మనోహర్, డిప్యూటీ ఈవోలు గుణభూషణ్‌రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, డిప్యూటీ ఈఈలు ఆనందరామ్, నాగభూషణం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

ఆలయంలో సోమవారం మహాసంప్రోక్షణ, శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాట్లు పూర్తి చేసింది. భారీ సంఖ్యలో తరలిరానున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు.



ఆలయ శిఖరంపై కలశ స్థాపన చేస్తున్న టీటీడీ ఆలయ అర్చకులు

ఏర్పాట్లు పరిశీలన

వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ ఏర్పాట్లను ఆదివారం జేఈవో వీరబ్రహ్మం అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తులందరూ దర్శనం చేసుకునేందుకు వీలుగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు మజ్జిగ, తాగు నీరు, ప్రసాదాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ తీవ్రతకు గురికాకుండా అధిక సంఖ్యలో షెల్టర్లు ఏర్పాటుచేయాలని సిబ్బందికి సూచించారు. ఆలయాన్ని విద్యుత్తు, పుష్పాలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దాలన్నారు. వాహనాల, రద్దీ క్రమబద్ధీకరణకు స్థానిక పోలీసుల సహకారంతో తగిన ఏర్పాట్లు చేయా లని సూచించారు. అతిథులు భక్తులను ఉద్దేశించి మాట్లాడేందుకు అవసరమైన పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, పీఆర్వో డాక్టర్ రవి, ఈఈ సుధాకర్ పాల్గొన్నారు.



అభిషేకం చేస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతారెడ్డి

క్లుప్తంగా

చంద్రబాబు జిత్తులకు లొంగని జూనియర్ ఎన్టీఆర్

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల పేరుతో చంద్రబాబునాయుడు వేసిన రాజకీయ ఎత్తుగడ నుంచి జూనియర్ ఎన్టీఆర్ తెలివిగా తప్పించుకోవడం చూస్తే ధృతరాష్ట్రుడు (చంద్రబాబు) కౌగిలిలోకి వెళ్లి భస్మమైపోతామని జూనియర్ ఎన్టీఆర్ తెలుసుకున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు అవసరానికి వాడుకుని వదిలేసే రకమని అన్నారు. పిల్లనిచ్చిన మామ దివంగత ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఇప్పుడు ఆయనకు భారతరత్న కోసం ఎంత పోరాటమైనా చేస్తామంటూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌ను వాడుకోవడానికి చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రధాని మోడీతో మాట్లాడి తానే రూ. 2 వేల నోట్లు రద్దు చేయించానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు.

క్రాఫ్ట్‌వర్క్‌పై విద్యార్థులకు శిక్షణ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు రంగు కాగితాలతో క్రాఫ్ట్ వర్క్ ఎలా చేయాలో ఆదివారం శిక్షణ ఇచ్చారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషంలో కోలాటాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బి.సురేష్‌కుమార్, సచివాలయ కార్యదర్శి ఎం.మహేష్, గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

గడ్డికుప్ప దగ్ధం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ సమీపంలో రమణమ్మ ఖాళీ స్థలంలో ఉన్న గడ్డికుప్ప అగ్నికి ఆహుతి అయింది. స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి బి.నర్సింగరావు మాట్లాడుతూ పక్కనే ఉన్న తోటలో వంటలు చేస్తున్న సమయంలో అగ్ని నిప్పులు గాలికి వచ్చి గడ్డి కుప్పపై పడడంతో మంటలు వ్యాపించినట్లు తెలిపారు. సుమారు రూ. 30 వేల ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థికసాయం

పసువులపాక, గడ్డి అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పాడి రైతు రమణమ్మకు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ ఆదివారం రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టంలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఆనందం ఉందన్నారు. దీంతో మహిళా రైతు రమణమ్మ రత్నాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
రామబాణం	: సత్యనారాయణ-1
అన్నీ మంచి శకునములే	: సత్యనారాయణస్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డీసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
ఫాస్ట్ ఎక్స్	: వెంకటేశ్వర
ఉగ్రం	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 92 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-28 యూనిట్లు, ఓ పాజిటివ్-57 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 249 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 136 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

ప్రమాదకరంగా.. ప్రధాన కూడలి

- కశింకోట జాతీయ రహదారి దాటేందుకు స్థానికుల ఇక్కట్లు
- రోడ్డు వెడల్పు చేయాలని వేడుకోలు
- చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు


కశింకోట కూడలిని భయం భయంగా దాటుతున్న ప్రజలు (ఫైల్)

కశింకోట: కశింకోటలోని జాతీయ రహదారి ప్రధాన కూడలి ప్రమాదకరంగా ఉంది. కూడలి దాటడానికి ప్రజలు, వాహన చోదకులు భయపడుతున్నారు. ఇక్కడ గతంలో పలు ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని విమర్శిస్తున్నారు. మండల కేంద్రమైన కశింకోట సుమారు 20 వేల జనాభా కలిగి ఉంది. చుట్టుపక్కల వెదురుపర్తి, సంపతిపురం, తమ్మయ్యపేట తదితర గ్రామాలకు కూడలిగా ఉంది. గ్రామం మీదుగా కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి ఉంది. దీనిపై రోజుకి వేలాది వాహనాలు వెళుతున్నాయి. దీంతో కశింకోట ప్రధాన కూడలి వద్ద రెండు వైపుల నుంచి అటు ఇటు ప్రజలు, వాహన చోదకులు, విద్యార్థులు, వృద్ధులు, ఉద్యోగులు, మహిళలు వందలాదిగా అనకాపల్లి, విశాఖ వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే విపరీతమైన ట్రాఫిక్ వల్ల రోడ్డు దాటడానికి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. సాయంత్రం అయితే ఎక్కువ సంఖ్యలో వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ నిలిచిపోతుండటం, కూడలి దాటడానికి అవకాశం లేక ఎక్కువ సమయం రోడ్డుకు రెండు వైపులా నిరీక్షించాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ పోలీసు కాపలా ఉన్నప్పుడు మాత్రమే రోడ్డు దాటడానికి అవకాశం కలుగుతోంది. ఇక్కడ సిగ్నల్స్ లేకపోవడం, రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటం ప్రధాన కారణంగా చెప్పవచ్చు. దీనివల్ల రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలు జరిగి పలువురు గతంలో మృతి చెందడం, క్షతగాత్రులు కావడం వంటి పలు సంఘటనలు చోటు చేసుకున్నాయి. అయినప్పటికీ సిగ్నల్ లైట్ల ఏర్పాటుకు, కూడలిలో రోడ్డు వెడల్పు చేయడానికి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని స్థానికులు విమర్శిస్తున్నారు. కూడలిలో చీకటి పడితే విద్యుత్ దీపాలు లేక అంధకారంగా ఉంటోంది. దీంతో దూరం నుంచి వచ్చే వాహన చోదకులకు కూడలిలో ఎవరెటు వెళుతున్నారో తెలియని పరిస్థితి ఉంది. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న దృష్ట్యా కూడలికి రెండు వైపులా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు దాటాలంటే భయంగా ఉంది



కూడలిలో సత్వరమే సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి ప్రజలు, వాహనచోదకులు సురక్షితంగా రోడ్డు దాటడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే ఫ్లైఓవర్ నిర్మించి ట్రాఫిక్ సమస్యను పూర్తిస్థాయిలో నివారించాలి. కూడలిలో సత్వరమే లైట్లు ఏర్పాటు చేసి వెలుగు కల్పించాలి.

– మాదేటి సత్తిబాబు, ఆటో డ్రైవర్, కశింకోట.

హారన్ల మోత భరించలేకపోతున్నాం



ప్రతి రోజు సాయంత్రం సుమారు 3 గంటలు పైబడి జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వాహనాల శబ్దాలు, హారన్ల మోతలు భరించలేకపోతున్నాం. జాతీయ రహదారిలో కశింకోట కూడలి ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కె. బ్రహ్మాజీ, కార్పెంటర్, కశింకోట.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం

కశింకోట వద్ద జాతీయ రహదారి కూడలిలో ట్రాఫిక్ నియంత్రకు చర్యలు తీసుకుంటున్నాం. కానిస్టేబుల్‌ను నియమించి వాహనచోదకులు, ప్రజలను రోడ్డు దాటిస్తున్నాం. కూడలి ఇరుగ్గా ఉండటం వల్ల సాయంత్రం జాతీయ రహదారిపై ఎక్కువగా రాకపోకలు సాగించే వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీని దృష్ట్యా కూడలి వెడల్పు చేయడానికి, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయడానికి, కూడలిలో లైటింగ్ ఏర్పాటుకు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతాం.

– ఎ. ఆదినారాయణరెడ్డి, ఎస్ఐ, కశింకోట.

అలంకారప్రాయంగా ఎస్కలేటర్

- నెలలో సగం రోజులు పని చేయని వైనం
- పట్టించుకోని కాంట్రాక్టర్
- ప్రయాణికులకు తప్పని అవస్థలు


రైల్వేస్టేషన్‌లో అలంకారప్రాయంగా మిగిలిన ఎస్కలేటర్

అనకాపల్లిటౌన్: అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎస్కలేటర్ మొరాయించింది. నెల కు సుమారు ఏడు నుంచి పది రోజులు ఇది పని చేయకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సౌత్‌సెంట్రల్ రైల్వే జోన్ పరిధిలో చిట్టచివర స్టేషన్, అనకాపల్లి జిల్లాలో ప్రధానమైన స్టేషన్‌లో ఇలాంటి సమస్య ఉన్నప్పటికీ విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు సమస్యపై దృష్టి సారించడంలేదు. స్టేషన్‌లో మూడు ప్లాట్‌ఫారాలు ఉన్నా యి. టిక్కెట్ బుకింగ్ ఒకటో నంబర్‌కు ఆనుకుని ఉంది. రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు వృద్ధులు, చిన్నారులు చేరుకునేలోపు రైలు కదిలిపోయే సందర్భాలు ఉన్నాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఎస్కలేటర్ ఆపరేటింగ్‌ను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ప్రయాణికుల సమస్యపై రైల్వే ఉన్నత స్థాయి అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కరాటే చాంపియన్‌కు అభినందన


కరాటే చాంపియన్ ఈశ్వరరావును అభినందిస్తున్న దాడి రత్నకర్

తుమ్మపాల: 19వ ఇంటర్‌నేషనల్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్-2023 (మలేషియా) పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన టి.ఈశ్వరరావును వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ తన నివాసంలో ఆదివారం అభినందించారు. కరాటే చాంపియన్లు విదేశాల్లో సైతం ప్రతిభ కనబరచి విజయాలు సాధించడం దేశానికి గర్వకారణమన్నారు. ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తుందన్నారు. కరాటేలో బ్లాక్ బెల్ట్ డివిజన్ 84 కేజీల కేటగిరిలో ఈశ్వరరావు గెలుపొందారు.

యువత సేవా దృక్పథంతో మెలగాలి


మజ్జిగ పంపిణీ చేస్తున్న కాండ్రేగుల విష్ణుమూర్తి

అనకాపల్లిటౌన్: వేసవి ఉష్ణోగ్రతలతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ప్రధాన కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో స్వర్గీయ గొంపా దుర్గ జ్ఞాపకార్థం 2005-08 ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ చలివేంద్రాని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ప్రభుత్వం పాదచారులు, వాహనచోదకులకు 12 తాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. యువత పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని మంచిమార్గాన్ని ఎంచుకోవాలని ఆయన కోరారు. విద్యార్థి దశ నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లయితే సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవచ్చన్నారు. సుమారు 1800 మందికి మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గ్రటిడ్డి నూకరాజు, జ్యోతుల గణేష్, తిమ్మాపాత్రుని రామ్‌ప్రవీణ్, పెదిరెడ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రోగులను ప్రేమిద్దాం


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కిశోర్‌కుమార్, వైద్యులు, ఏఎన్ఎంలు

అనకాపల్లిటౌన్: హెచ్‌ఐవీ రోగులను ప్రతి ఒక్కరూ ప్రేమించాలని హెచ్‌ఐవీ విభాగం ఇన్‌చార్జి డీఎల్ఏటీవో డాక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. స్థానిక వైద్యాలయంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దీపస్ స్మృత్యంజలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌రోగుల పట్ల వివక్ష చూపరాదన్నారు. ఈ వ్యాధిని అంతమొందించేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువత ముందుకు రావాలని కోరారు. గడచిన 15 ఏళ్లలో వ్యాధితో 9298 మంది మరణించడం శోచనీయమన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో 37,886 మంది హెచ్‌ఐవీ రోగులున్నారని, ఆరిలోవలో 17,926 మంది మందులు వాడుతున్నారని ఆయన తెలిపారు. ప్రతినెలా రూ.2,750 ప్రభుత్వ పింఛన్ అందుకుంటున్న హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు జిల్లాలో 3,544 మంది ఉన్నారన్నారు. అంతకు ముందు వ్యాధితో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రియదర్శిని, ఐసీటీసీ సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు, ఏఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు.

మూలపేటలో కంటి వైద్య పరీక్షలు


దృష్టిలోపం ఉన్న వారికి కళ్లజోళ్లు అందిస్తున్న నిర్వాహకులు

అనకాపల్లి రూరల్: మండలంలోని మూలపేట గ్రామంలో సోదదాసి శ్రీనివాస్ శామ్యూల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం జరిగింది. స్థానికులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో దృష్టిలోపం ఉన్న 16 మందికి ట్రస్ట్ చైర్మన్ ఎస్. శాంతి కళ్లజోళ్లు అందజేశారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగా అప్పలనాయుడు, వార్డు సభ్యులు యల్లపు హైమావతి, అడారి సత్యనారాయణ, కాండ్రేగుల వరలక్ష్మి, శ్రీనివాసరావు, రైతు సంఘం నేత యల్లపు నాయుడు, లక్ష్మీభాయి కుమార్, ఆదిరాజు పాల్గొన్నారు.

27, 28న యోగా సంస్థ ప్రథమ వార్షికోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న దొరమనాయుడు

అనకాపల్లిటౌన్: స్థానిక జూనియర్ కళాశాల క్లబ్ యోగా సెంటర్ ఆవరణలో ఈనెల 27, 28 తేదీల్లో యోగా ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు యోగా గురువు భీశెట్టి దొరమనాయుడు తెలిపారు. యోగా సెంటర్ ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యంగా జీవించాలంటే నిత్యం యోగా చేయాలని అన్నారు. 27న యోగాపై పట్టణంలో పురవీధుల మీదుగా అవగాహన ర్యాలీలు, 28న క్లబ్ ఆవరణలో యోగాసనాలపై పోటీల నిర్వహణ, పోటీల్లో గెలిపొందిన వారికి సాయంత్రం బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉదయం, సాయంత్రం యోగా చేయడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా సభ్యులు పెంటకోట సుబ్రహ్మణ్యం, కొలపర్తి కన్నబాబు, భీమరశెట్టి శ్రీనివాసరావు, ఆడారి చినవీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాబూ.. ఇదొద్దు

- రూ.2వేల నోటుకు కూలీల తిరస్కరణ

అనకాపల్లి రూరల్: ఆర్‌బీఐ రూ.2 వేల నోట్ల చలామణి నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించిన 24 గంటల్లోనే మారుమూల గ్రామాల్లో వీటి బట్వాడా పూర్తిగా నిలిచిపోయింది. వాస్తవానికి సెప్టెంబర్ వరకూ ఒకవ్యక్తి రోజుకు రూ.20 వేల చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేసుకోవచ్చునని ఆర్‌బీఐ ప్రకటించింది. కానీ గ్రామస్థాయిలో కర్షకులు, కూలీలు, చిరుద్యోగులు రూ.2 వేల నోటు ఎవరైనా ఇస్తుంటే బాబోయ్ అంటూ కళ్లు తేలేస్తున్నారు. తమ వద్ద పని చేస్తున్న సిబ్బంది, కూలీలు కూడా వీటిని పుచ్చుకోకపోవడంతో పలువురు యజమానులు అయోమయంలో పడ్డారు. గత కొన్ని నెలల నుంచి అలికిడి లేకుండా పోయిన రూ.2 వేల నోట్లు ఇప్పుడు పాముకి పాగబెడితే బయటికి వచ్చినట్టు ఆర్‌బీఐ ప్రకటనతో బయటికి రావడం మొదలయింది. పలు రంగాలకు చెందిన వ్యక్తుల నివాసాల్లో రూ.లక్షల్లో రూ.2 వేల నోట్లు పేరుకుపోయాయనే గుసగుసలు వినబడుతున్నాయి. భారీస్థాయిలో ఈ నోట్లను గనుక ఒకే వ్యక్తి బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే వారిపై నిఘా వుండే అవకాశం లేకపోలేదని పలువురు చెబుతున్నారు. దీంతో తమ వద్ద పని చేస్తున్న సిబ్బంది, కర్షక, కార్మికుల పేర్లతో బ్యాంకుల్లో రోజుకు రూ. 20 వేల చొప్పున రూ.2 వేల నోట్లు డిపాజిట్ చేసేందుకు యజమానులు ప్రాధేయపడుతున్నట్లు తెలుస్తోంది.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు


బాలికల పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థులు

కశింకోట: కశింకోటలోని ప్రమీల తోటలో 2007-08 విద్యా సంవత్సరంలో స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాల (అప్పట్లో ప్రాథమికోన్నత పాఠశాల) 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. సాధారణంగా టెన్త్, ఆ పై తరగతుల పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు జరగడం సాధారణం. అయితే అరుదుగా తొలిసారి సెవెన్త్ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరస్పరం ఆప్యాయంగా పలకరించుకుని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఆట పాటలతో ఆనందంగా గడిపారు. తమకు విద్య బోధించిన ఉపాధ్యాయులు రెడ్డి నారాయణరావు, పీఎం అప్పారావు, కె.వరలక్ష్మి, లలితాదేవి, హేమలత, పుష్పలత, రమాదేవిలను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. సామూహికంగా భోజనాలు చేసి ఫోటో దిగారు. సుమారు 50 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దైవచింతనతో సంపూర్ణ ఆరోగ్యం


ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ లక్ష్మీసౌజన్య, రత్నాకర్

అనకాపల్లిటౌన్: దైవచింతన కలిగిన వారు ఆరోగ్యంగా జీవిస్తారని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య అన్నారు. గవరపాలెం విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో శ్రీ అభయ ఆంజనేయ ఆలయ 6వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. దేవాలయాల వార్షికోత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, రత్నాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 80, 81 వార్డుల ఇన్‌చార్జిలు కొణతాల భాస్కరరావు, పీలా రాంబాబు, రేబాక ఇంద్రకుమార్, పార్టీ నాయకులు పీలా శ్యామ్, భీశెట్టి కృష్ణ అప్పారావు, కాండ్రేగుల చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధితో ఆహ్లాదకర వాతావరణం


అన్నమయ్య పార్కు పరిసరాలను శుభ్రం చేయిస్తున్న ఆప్ నేతలు

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ అధికారులు పార్కులను అభివృద్ధి చేస్తే పిల్లలు, వృద్ధులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదం పొందుతారని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథబాబు అన్నారు. స్థానిక శారదా నది ఒడ్డును అన్నమయ్య పార్కును ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో ఆదివారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాలు క్రితం అన్యమయ్య పార్కు ఎంతో ఆహ్లాదంగా ఉండేదని, శారదా నదిపై నూతన బ్రిడ్జి నిర్మించిన తర్వాత పార్కును అభివృద్ధి చేసే అధికారులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నది ఒడ్డున ఉండే పార్కులను అభివృద్ధి చేస్తే చక్కటి వాతావరణంతో స్వచ్ఛమైన వాతావరణం అందరికీ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు సీహెచ్ శ్రీనివాసరావు, బాబ్జి, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కిరిబిక్కిరి


నిర్మానుష్యంగా మారిన అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయం రహదారి

అనకాపల్లిటౌన్: పది రోజులుగా భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో పట్టణవాసులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఆదివారం 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. దీంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. అటు సూర్యతాపం.. ఇటు తీవ్రమైన ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు, సుదీర్ఘ ప్రాంతాల నుంచి అనకాపల్లి వచ్చే భక్తులు అల్లాడిపోతున్నారు. ఆదివారం కావడంతో వారానికి ఒక్కసారి కుటుంబ సమేతంగా బయటికి వెళ్లి సరదాగా గడుపుదాం అనుకునే వారు ఎండ తీవ్రత చూసి ఇళ్లకే పరిమితమయ్యారు. రిక్షా డ్రైవర్లు చెట్ల కింద సేదదీరాల్సి వస్తోంది. వివిధ వాహనాల డ్రైవర్లు ఎండలో వాహనాలు నడపలేక ఇబ్బందులు పడుతున్నారు.

దివంగత నేత రాజీవ్‌గాంధీకి నివాళులు


రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గంగాధర్ తదితరులు

అనకాపల్లిటౌన్: శాస్త్ర, సాంకేతిక రంగాలను దేశంలో ప్రవేశపెట్టిన ఘనత మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీకే దక్కిందని నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. స్థానిక గాంధీనగరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన నేత రాజీవ్‌గాంధీ అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు యువత కృషి చేయాలన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోష్‌కుమార్, నాయకులు మళ్ల శివకుమార్, పిల్లి త్రినాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోట పంచాయతీ ప్రధాన రహదారిలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆదివారం పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, న్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు సూరా శ్రీనివాస్, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు కాళ్ల సత్యనారాయణ, ఐఆర్ గంగాధర్, దాసరి సంతోష్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సూరిశెట్టి ఆదిబాబు, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బి.బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం


సమావేశానికి హాజరైన ఎంఈవోలు, ప్రిన్సిపాళ్లు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు అనే కార్యక్రమం ద్వారా నగదు ప్రోత్సాహంతో సత్కరిస్తున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్ ఆవరణలో జిల్లాలో గల ఎంఈవోలు, ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆదివారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 25న నియోజకవర్గస్థాయి, 27న జిల్లా స్థాయి, 31న రాష్ట్రస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి హైస్కూల్ నుంచి మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు, జిల్లాస్థాయిలో ముగ్గురు విద్యార్థులకు, రాష్ట్రస్థాయిలో ఒక విద్యార్థికి నగదు ప్రోత్సాహం అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బి.సుజాత, జిల్లాలో గల ఎంఈవోలు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కండక్టర్ మార్పు చేయనున్న దృష్ట్యా సోమవారం ఉదయం 7.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తెలిపారు. జాతీయ రహదారికి అడ్డంగా కండక్టర్‌ను మార్పు చేయనున్నట్లు తెలిపారు. దీని దృష్ట్యా సబ్‌స్టేషన్ పరిధిలోని తాళ్లపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, ఉగ్గినపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.